ఔట్ సోర్సింగ్‌లో 1578 పారిశుధ్య కార్మికులు

నియామకానికి సర్కారు అనుమతి

సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో కొత్తగా 1578 శానిటేషన్ వర్కర్ల నియామకానికి అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ జీవో నం. 1473ను జారీ చేసింది. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నెలకు రూ.15,600ల వేతనం చొప్పున నియమించనున్నారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ పరిధిలో 25,613ల మంది పారిశుధ్య కార్మికులు ఉండగా, పెరుగుతున్న పారిశుధ్య అవసరాల దృష్ట్యా ఈ నియామకాలను చేపట్టనున్నారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికల్లా శానిటేషన్ వర్కర్లను నియమించుకోనున్నారు.

నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 21 నవంబర్ 2024 | HYDERABAD



సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం జూబ్లీహిల్స్‌లోని భరణి లే అవుట్‌లో నివాసముంటున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సిబ్బందికి తమ కుటుంబ వివరాలను అందజేశారు.
-బంజారాహిల్స్, నవంబర్ 20

ఠాణా ఖర్చులకు పైసల్లేవ్!

మూడు నాలుగు నెలలకోసారి నిధులు మంజూరు.. ఖర్చుల పేరుతో తిరిగి ప్రారంభమైన మామూళ్ల దందా

- అప్పుడప్పుడు వచ్చే నిధులను వెనకేసుకుంటున్న కొందరు ఎస్‌హెచ్‌ఓలు
- వాటాల కోసం అధికారుల మధ్య కుమ్ములాటలు
- అవసరమైన బిల్లులు సకాలంలో అందించి పోలీస్ శాఖపై అవినీతి మరకను తుడి చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- నేడు మళ్లీ పురుడుపోసుకుంటున్న జాడ్యం

సిటీబ్యూరో: పోలీస్ ఠాణాలకు నెలవారీ ఖర్చులకు ప్రభుత్వం అందించే నిధులకు బ్రేక్ పడుతున్నది. దీంతో చాలా పోలీస్‌స్టేషన్లలో అవినీతి, అక్రమాలు పెరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. నెలవారీ మామూళ్లు వసూలు చేయడం, ఫిర్యాదుదారులు, నిందితుల వద్ద ఖర్చులకంటూ వసూలు చేస్తూ.. నిధులు రాకపోవడాన్ని కారణంగా చూపిస్తూ.. అవినీతికి ఆజ్యం పోస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. కొన్ని పోలీస్‌స్టేషన్లకు మూడు నాలుగు నెలలుగా నిధులు రావడం లేదని పోలీసు వర్గాల్లో చర్చనడుస్తున్నది. కొందరు ఇన్‌స్పెక్టర్లు ఇదే అదనుగా ఒకేసారి మూడు నాలుగు నెలలకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చే నిధులను ప్రభుత్వం విడుదల చేసిందంటే.. ఆ డబ్బులను నేరుగా వెనకేసుకునే పనిలో ఉన్నారన్న ఆరోపణలున్నాయి. ఇలా ఠాణా నిర్వహణకు వచ్చే ఖర్చుల పంపకాల్లో ఎస్‌హెచ్ఓ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ)ల మధ్య తగాదాలు కూడా చోటు చేసుకుంటున్నట్లు తెలిసింది. ట్రై పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చాలా ఠాణాల్లో ఈ వ్యవహారం కొనసాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అవినీతి మరకను తుడిచేసిన గత సర్కారు

ఠాణాలకు వచ్చే ప్రజల నుంచి ఒక పైసా కూడా తీసుకోవద్దని, నెలవారీ మామూళ్లు వసూలు చేయవద్దని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం..2015లో పోలీస్‌స్టేషన్లలో ఖర్చులకు నిధులు మంజూరు చేసింది. పీఎస్‌లను ఏ,బీ,సీ విభాగాలు చేసి ప్రధాన నగరాల్లో ఉన్న ఠాణాలను ఏ గ్రేడ్ కింద నెలకు రూ. 75 వేలు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు రూ. 25 వేల చొప్పున నిధులను కేటాయించింది. వీటిని పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారికి అవసరమైతే మంచినీళ్లు, టీ ఇవ్వడంతో పాటు కేసుల ఇతరాత్ర అయ్యే టీ ఖర్చుతో పాటు స్టేషనరీ, ట్రాన్స్‌పోర్టు, రవాణా ఖర్చులు, సిబ్బంది భోజనం వంటి వాటికి ఖర్చుపెట్టాలని సూచించింది. కేసుల దర్యాప్తునకు అయ్యే ఖర్చులు పూర్తిగా పోలీసులే భరించాలని, తద్వారా పోలీసులు చెయ్యి చాచి ఎవరినీ డబ్బులు అడిగే పరిస్థితి ఉండవద్దని, మామూళ్లు అనేవి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండవద్దని బీఆర్ఎస్ ప్రభుత్వం పోలీసు శాఖపై ఉన్న అవినీతి మరకను తుడి చేసింది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నిధులు సరైన సమయానికి పోలీసులకు అందించకపోవడంతో చాలా పోలీస్‌స్టేషన్లు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నట్లే తిరిగి మామూళ్ల దందా.. ఠాణాకు వచ్చే ఫిర్యాదుదారులు, నిందితుల నుంచే ఖర్చులకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

డమ్మీ బిల్లులు..

ప్రతి నెలా స్టేషనరీ, ట్రావెల్, భోజనాల ఖర్చులు ఇలా అన్ని బిల్లులు తయారు చేసే స్టేషన్ రైటర్ లేదా అకౌంటెంట్ ద్వారా ఆ బిల్లులను కమిషనరేట్ కార్యాలయానికి పంపిస్తే.. అక్కడి నుంచి పేఅండ్ అకౌంట్స్ విభాగానికి వెళ్తాయి.. ఆ తరువాత అక్కడి నుంచి ఆయా ఠాణాలకు చెక్కులు జారీ అవుతుంటాయి. చాలా మంది ఇన్‌స్పెక్టర్లు ఈ బిల్లులను డమ్మీవి పెడుతున్నట్లు ఆరోపణలున్నాయి. గతంలో ఈ ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు సైతం ఈ విషయంపై లోతుగా దర్యాప్తు జరిపినట్లు సమాచారం. తన స్టేషన్ పరిధిలో ఉండే దుకాణాలు, ఇతర ప్రాంతాల్లో ఉన్న హోటల్స్, ట్రావెల్స్, స్టేషనరీల నుంచి కావాల్సిన బిల్లులు తీసుకుంటూ.. వాటినే ఠాణాకు ఖర్చు చేసిన వివిధ బిల్లులుగా పొందుపరుస్తున్నారనే ఆరోపణలున్నాయి. అయితే కొన్ని సందర్భాల్లో బిల్లులు పెట్టినా.. మూడు నాలుగు నెలలకోసారి నిధులు మంజూరవుతుండటంతో నెలవారీగా ఆయా ఠాణాల పరిధిలో మామూళ్లు వసూలు చేయడం, కావాల్సిన పనులు ఠాణా పరిధిలో ఉండే ఆయా వ్యక్తులతో ఎస్‌హెచ్ఓలు చేయించుకుంటున్నారని, ఆ పనిని ఉచితంగా చేయించుకొని.. తాము సొంతంగా డబ్బులు పెట్టామంటూ అందుకు సంబంధించిన బిల్లులు డమ్మీవి తెచ్చి వాటినే పైకి పంపిస్తున్నట్లు సమాచారం.



పెండింగ్‌లో పెట్టడం వల్లే..

ఇదిలాఉండగా బిల్లులు పెండింగ్‌లో ఉండగానే ఆ ఎస్‌హెచ్ఓ బదిలీ అయితే.. ఆ బిల్లులు కొత్తగా వచ్చిన ఎస్‌హెచ్ఓ హయాంలో మంజూరైతే అవి తాను గతంలో ఖర్చుచేసిన బిల్లులని తనకే రావాలంటూ పాతవారు, 'లేదు నాకు సంబంధం లేదు.. నేను వచ్చిన తరువాత మంజూరయ్యాయి.. అవి మాకే' అంటూ కొత్తవాళ్లు కూడా గొడవపడుతున్నట్లు సమాచారం. అలాగే ఠాణాలకు వచ్చే నిధుల్లో ఏసీపీలు కూడా కొందరు వాటాలు తీసుకుంటున్నట్లు సమాచారం. నెలవారీగా ఠాణాకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే ఎలాంటి సమస్యలుండవని, అలా కాకుండా పెండింగ్‌లో పెట్టడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పోలీసులు మాట్లాడుకుంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని, నిధులు సక్రమంగా విడుదల చేయించాలని, పోలీస్ శాఖలో మొదలైన అవినీతిని మొక్కగా ఉన్నప్పుడు తొలగించాలని, లేదంటే భవిష్యత్‌లో అవినీతి పెరిగి పోలీస్ శాఖకు చెడ్డపేరు వచ్చే అవకాశాలు ఉంటాయని పలువురు హెచ్చరిస్తున్నారు.

కొందరు ఎస్‌హెచ్ఓలు..

ముందుగా ఖర్చుపెట్టి ఆ బిల్లులనే మేం పెడుతున్నామని.. ఎవరికీ వాటాలు ఇచ్చేది లేదంటూ కొందరు ఇన్‌స్పెక్టర్లు డీఐలు, ఎస్సైలకు తేల్చి చెబుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఆయా కేసుల్లో ఏమైనా ఖర్చులు ఉంటే ఎవరి కేసుకు సంబంధించి వారే వెచ్చిస్తుంటారు. అయితే కొందరు ఎస్‌హెచ్ఓలు ఆయా పనులన్నీ తమ సొంత ఖాతాలో వేసుకొని అందుకు సంబంధించిన బిల్లులు పైకి పంపిస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. సర్కారు నుంచి పైసలు వచ్చినా.. అందులో తమ వాటా కావాలంటూ ఎస్‌హెచ్ఓలను ప్రశ్నిస్తున్న డీఐలు కూడా ఉన్నారని, ఇరువురి మధ్య అక్కడక్కడ గొడవలు కూడా జరుగుతున్నాయని తెలిసింది. ఈ విషయాలు బయటకు వస్తే తమ ఉద్యోగాలకే ఎసరుపడుతుందని అందరూ గప్‌చుప్‌గా ఉంటున్నారు.

చారిత్రక కట్టడాలు కనుమరుగేనా?

ఓల్డ్ సిటీ మెట్రోతో పొంచి ఉన్న ముప్పు

హెచ్ఎంఆర్ఎల్ జాబితాలో 100కు పైగా నిర్మాణాలు

సిటీబ్యూరో: ఓల్డ్ సిటీ మెట్రోతో నగరంలో చారిత్రక కట్టడాలకు ప్రమాదం పొంచి ఉంది. ప్రాజెక్టు వెళ్తున్న మార్గంలో రోడ్ల విస్తరణ, పిల్లర్లు వంటి నిర్మాణ కార్యకలాపాలతో దర్గాలు, కట్టడాలు, పురాతన భవనాలు కనుమరుగు కానున్నాయి. 7.5 కిలోమీటర్ల నిర్మాణంలో 100కు పైగా కట్టడాలు ఉన్నాయని హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ గుర్తించింది. వీటికి నష్టం లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నా... ఆస్తులను సేకరిస్తే తప్ప.. పనులు చేయలేని పరిస్థితి ఉన్నట్లు తేలింది. ఈ క్రమంలో భూ సేకరణ అనివార్యం కావడంతో... మరో దఫా అధ్యయనం చేయనున్నట్లు తెలిసింది. మతపరమైన, వారసత్వ కట్టడాలు, కుల, ఆలయ సంఘాలతో చర్చలు జరపనున్నారు. ఇక రోడ్డు విస్తరణ వల్ల రోడ్డుకు ఇరువైపులా 60 ఫీట్లకు పైగా కూల్చివేయనున్నారు. దీంతో కూడా మెజార్టీ కట్టడాలు నేలకూలే ప్రమాదం ఉందని, ఇక భారీ పిల్లర్ల నిర్మాణంతో భౌగోళికంగా కూడా మార్పులు వచ్చే అవకాశం ఉందని, పురాతన భవనాలకు కూడా ప్రమాదం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

7.5 కిలోమీటర్ల ఆస్తుల సేకరణకు..

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మేర ఆస్తుల సేకరణకు అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా తొలి దశలో 200 ఆస్తులకు సంబంధించి డీక్లరేషన్ తీసుకునేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అయితే ఈ ప్రాజెక్టు వల్ల 1000కి పైగా ఆస్తులు నష్టపోతుండగా, ఇందులో మెజార్టీ నిర్మాణాలు చారిత్రక, మతపరమైనవేనని తేల్చారు. వీటిని సంరక్షించుకునేందుకు ఇప్పటికే మతపెద్దలు, ఆలయ నిర్వాహకులు, వారసత్వ, చారిత్రక నిర్మాణాలపై పనిచేసే స్వచ్ఛంద సంస్థలు పోరాడుతున్నాయి.

చారిత్రక ఆనవాళ్లు..

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణ్‌గుట్ట వరకు ఇప్పటివరకు చేపట్టనున్న మెట్రో ప్రాజెక్టుతో కనుమరుగు కానున్న చారిత్రక, మతపరమైన కట్టడాలు, నిర్మాణాలు 100కు పైగా ఉన్నాయి. 21 మసీదులు, 12 దేవాలయాలు, 55 దర్గాలు, అషూర్ఖానాలతోపాటు, 13 శ్మశాన, చిల్లాలను ముందుగా హెచ్ఎంఆర్ఎల్ గుర్తించింది. నిర్మాణాలు, కట్టడాలు, భవనాలకు ఎలాంటి నష్టం లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నా... ఆస్తులను సేకరిస్తే తప్ప.. పనులు చేయలేని పరిస్థితి ఉన్నట్లు తేలింది. ఈ క్రమంలో భూ సేకరణ అనివార్యం కావడంతో... మరో దఫా అధ్యయనం చేయనున్నట్లు తెలిసింది. మతపరమైన, వారసత్వ కట్టడాలు, కుల, ఆలయ సంఘాలతో చర్చలు జరపనున్నారు. ఇక రోడ్డు విస్తరణ వల్ల రోడ్డుకు ఇరువైపులా 60 ఫీట్లకు పైగా కూల్చివేయనున్నారు. దీంతో కూడా మెజార్టీ కట్టడాలు నేలకూలే ప్రమాదం ఉందని, ఇక భారీ పిల్లర్ల నిర్మాణంతో భౌగోళికంగా కూడా మార్పులు వచ్చే అవకాశం ఉందని, పురాతన భవనాలకు కూడా ప్రమాదం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ప్రత్యామ్నాయం పేరిట..

ప్రధానమైన నిర్మాణాలు చెక్కు చెదరకుండా ఉండేందుకు మెట్రో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు చెబుతున్నా... క్షేత్రస్థాయిలో సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ఇరుకైన మార్గాలు ఉండే ఈ ప్రాంతంలో మెట్రో స్టేషన్లకు భారీ స్థాయి భూములను సేకరించాల్సి ఉంటుంది. కనీసం 150-200 ఫీట్ల వెడల్పు ఉండే ప్రాంతంగా పక్కన ఉండే భవనాలు, కట్టడాలు కూల్చివేయాల్సి ఉంటుంది.

రోదనల మధ్య కూల్చివేత

- గచ్చిబౌలిలో నాలుగంతస్తుల భవనం నేలమట్టం చేసిన డీఆర్ఎఫ్
- సర్వం కోల్పోయి రోడ్డున పడ్డామంటూ యజమానుల కన్నీరు

బుధవారం ఒరిగిన భవనాన్ని కూల్చివేస్తుండగా, కన్నీరుమున్నీరవుతున్న యజమానురాలు

సిటీబ్యూరో/కొండాపూర్, నవంబర్ 20 : గచ్చిబౌలి సిద్ధిక్‌నగర్‌లో పక్కకు ఒరిగిన భవనాన్ని అధికారులు నేలమట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భవనం చుట్టు పక్కల ఉన్న ఇండ్లలోని నివాసితులను తొలుత ఖాళీ చేయించారు. బిల్డింగ్ యజమానికి జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులిచ్చి.. భారీ పోలీసు బందోబస్తు మధ్య బుధవారం ఉదయం కూల్చివేత మొదలుపెట్టి.. అర్ధరాత్రి ముగించారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పర్యవేక్షణలో హైడ్రాకు చెందిన భారీ యంత్రం సహాయంతో కూల్చివేత పనులు చేపట్టారు. మధ్యాహ్న సమయంలో భారీ యంత్రంలో సాంకేతిక సమస్య తలెత్తగా.. మూడు గంటల పాటు కూల్చివేతల ప్రక్రియ తాత్కాలికంగా నిలిపి వేసి ఆ తర్వాత మరమ్మతులు జరిపి యంత్రంతో మళ్లీ కూల్చివేతలు జరిపారు. సెక్షన్ 124, 324ల కింద జీహెచ్ఎంసీ అధికారులు మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో సంబంధిత యాజమానిపై ఫిర్యాదు చేశారు.

అసలేం జరిగింది?

సిద్ధిక్‌నగర్ బస్తీలోని 1639 ప్లాట్‌లో నాలుగంతస్తుల భవనం నిర్మాణం ఉంది. దానికి ఆనుకొని ఉన్న ఖాళీ ప్లాట్లయిన 1605, 1638లలో సిల్ట్+2 అంతస్తుల పర్మిషన్‌తో సదరు యజమాని నిర్మాణ పనులు చేపట్టారు. భవన నిర్మాణ పనుల్లో భాగంగా పుట్టింగుల నిమిత్తం భారీ గుంతలు తీశారు. దీంతో పక్కనే ఉన్న భవన పిల్లర్లు బయటకు వచ్చి, ఒక వైపు ఒరిగింది. పుట్టింగులపై ఇంజినీర్ల పర్యవేక్షణ లేకపోవమే ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో భవనం ఒక్కసారిగా భూకంపం వచ్చిన మాదిరిగా ఒరిగిపోవడంతో అందులో అద్దెకుంటున్న జనాలు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. బిల్డింగ్ పూర్తిగా ఒక వైపునకు ఒరగడంతో స్థానికంగా చుట్టు పక్కల ఇండ్లలోని నివాసితులు భయాభ్రాంతులకు గురై జీహెచ్ఎంసీ, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు ఒరిగిన భవనంతో పాటు దాని చుట్టు పక్కల ఉన్న నివాసితులు ఖాళీ చేయించి, సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఒరిగిన భవనాన్ని పరిశీలించి, కూల్చి వేసేందుకు నిర్ణయించారు. గురువారం ఉదయాన్నే హైడ్రాకు చెందిన భారీ యంత్రాన్ని ఒరిగిన భవనం వద్దకు తీసుకువచ్చి కూల్చివేత పనులు మొదలుపెట్టారు. అయితే భవనంలోని వంట గ్యాస్ సిలిండర్లు ఉండటంతో కూల్చివేత పనులు నెమ్మదిగా కొనసాగించారు. దీంతో పాటు పక్కనే ఉన్న మరో భవనానికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఒరిగిన బిల్డింగ్‌ను ఉన్న చోటనే నేలమట్టం చేసేలా పనులు సాగించారు. కూల్చివేత పనులు సాగుతున్న సమయంలో అటుగా స్థానిక ప్రజలు, అద్దెకుంటున్న వారు ఎవరినీ రాకుండా నలువైపులా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తప్పిన భారీ ప్రాణనష్టం

గ్రౌండ్ ప్లస్ నాలుగు అంతస్తులతో ఉన్న ఆ భవనంలో మొత్తం 8 పోర్షన్లలో 48 మంది అద్దెకు ఉంటున్నారు. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, హోటల్‌లో పని చేస్తున్న వారు, ఇతర ప్రైవేట్ జాబ్‌లు చేసుకునే వారు ఉన్నారు. ఎక్కువ శాతం అసోం, మణిపూర్‌కు చెందిన చిరుద్యోగులు ఉన్నారు. కాగా భయాందోళనతో కట్టుబట్టలతో బయటకు పరుగులు తీసిన వారు, వారికి సంబంధించిన సెల్‌ఫోన్లు, సర్టిఫికెట్లు, ల్యాప్‌టాప్‌లు, విలువైన వస్తువులు, నగదులు ఇంట్లోనే ఉండిపోయాయి. వాటిని తీసుకునే ప్రయత్నం చేసినా.. పోలీసులు భవనంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. బుధవారం ఉదయాన్నే భారీ యంత్రంతో కూల్చివేస్తుంటే అద్దెకున్న వారు తమ విలువైన వస్తువులను తెచ్చుకుంటామని పోలీసులను వేడుకున్నా.. ప్రాణపాయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అనుమతించలేదు. కాగా, అర్ధరాత్రి నుంచి ఒరిగిన బిల్డింగ్ ఎటు వైపు కూలుతుందోనని చుట్టు పక్కల ఉన్న భవనాల యజమానులు, అందులో నివాసముంటున్న వారు కంటి మీద కునుకు లేకుండా రాత్రంగా గడిపారు.

కండ్ల ముందే నేలమట్టం..

'కూడబెట్టుకున్న డబ్బులతో పాటు ఉన్న పొలం అమ్మగా వచ్చిన సొమ్ముతో ఇల్లు కట్టుకున్నాం. సొంతింటి కల నెరవేరడంతో పాటు ఎంతో కొంత ఆసరగా అద్దెలు వస్తాయని, పిల్లల భవిష్యత్‌కు భరోసా ఉంటుందన్న గంపెడాశతో కట్టుకున్న ఇల్లు కండ్ల ముందే నేలమట్టమవుతుంటే భరించలేకపోతున్నాం' అని ఇంటి యజమానులు లక్ష్మణ్, స్వప్న దంపతులు రోదించిన తీరు అందరి హృదయాలను కలచివేసింది. చేయని తప్పుకు తమకు తీరని నష్టం వాటిల్లడంతో పాటు తమ కుటుంబం రోడ్డుపైకి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో భవన నిర్మాణం కోసం అడ్డగోలుగా తవ్విన పిల్లర్ల గుంతల వల్లే తమ బిల్డింగ్ కూలిపోయే పరిస్థితి వచ్చిందన్నారు.

తలా పాపం తిలా పిడికెడు

సిద్ధిక్‌నగర్‌లో 50 నుంచి 100 గజాలలోని స్థలంలో 5 నుంచి 6 అంతస్తులకు మించకుండా భవన నిర్మాణాలు చేస్తున్నారు. వీటిని హాస్టళ్లకు, ఓయో రూంలకు అద్దెకిస్తూ యజమానులు లక్షల్లో వసూళ్లు చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను ఆదిలోనే అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్మాణదారులు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి, 'మీరు కట్టుకోండి మీ వెనకాల మేముంటామం'టూ అనధికారంగా అండగా నిలుస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుపెట్టుకుని టౌన్‌ప్లానింగ్ అధికారులు కోట్లకు పడగలెత్తారు. అక్రమ నిర్మాణాలతో అనుకోని పరిస్థితుల్లో అగ్నిప్రమాదం సంభవించిన ఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్ కూడా చేరుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి.

కల్తీ అల్లం..వెల్లుల్లి పేస్ట్

సిటీబ్యూరో: ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతోన్న ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్లపై జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ, వైద్యారోగ్యశాఖ టాస్క్ ఫోర్స్ ఉక్కుపాదం మోపుతున్నది. తాజాగా కాటేదాన్‌లోని యుమని ఫుడ్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఫుడ్ సేఫ్టీ విభాగం విస్తృత తనిఖీలు చేపట్టింది. అధికారులు స్టోర్ రూంలో సింథటిక్ ఫుడ్ కలర్ (టార్ట్రాజిన్) 50 కిలోలను గుర్తించి సీజ్ చేశారు. ఈ కలర్‌ను అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీలో ఉపయోగిస్తున్నట్లు తేల్చారు. 400 కిలోల అల్లం ప్యాకెట్లను సీజ్ చేసి నమూనాలను ల్యాబ్‌కు పంపించారు. పరిసర ప్రాంతాలు సాలె పురుగులు, ఇతర క్రిమికీటకాలు ఉన్నట్లు గుర్తించారు. కాటేదాన్‌లోని ఎస్‌కేఆర్ ఫుడ్ ప్రొడక్ట్స్‌లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. తయారీ కేంద్రంలో అపరిశుభ్రమైన వాతావరణం ఉన్నట్లు పేర్కొన్నారు. 1000 కేజీల ప్యాకెట్లను నమూనాలకు ల్యాబ్‌కు పంపారు. సంబంధిత నిర్వాహకులపై జరిమానా, ఇతర చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఓయోలో గంజాయి

సిటీబ్యూరో, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఓయో రూమ్ కేంద్రంగా గంజాయి విక్రయాలు జరుపుతున్న వ్యక్తిని శంషాబాద్ డీటీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ఓయో రూంలో నిందితుడి వద్ద నుంచి రూ.లక్ష విలువ చేసే 4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. శంషాబాద్ ఈఎస్ కృష్ణప్రియ కథనం ప్రకారం...జమ్మూకశ్మీర్‌కు చెందిన పవన్‌కుమార్, సచిన్ కుమార్ నగరానికి వలస వచ్చి.. చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే వ్యసనాలకు అలవాటు పడిన వీరు.. డబ్బుల కోసం గంజాయి విక్రయించడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో పోలీసులకు అనుమానం రాకుండా ఉండేందుకు గండిపేటలోని టీఎన్‌జీవో కాలనీలో ఉన్న ఓయో రూంలోని 205వ నంబర్ గదిలో గంజాయి పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. సమాచారం అందుకున్న శంషాబాద్ డీటీఎఫ్ పోలీసులు ఓయో రూంపై దాడులు జరిపి పవన్‌కుమార్‌ను అరెస్టు చేశారు. మరో నిందితుడు సచిన్ పరారీలో ఉన్నాడు.

చెరువులకు పునరుజ్జీవం

కాలుష్యరహితంగా మార్చేందుకు చర్యలు

అపార్ట్‌మెంట్లలో ఎస్టీపీల ఏర్పాటుపై దృష్టి

తొలివిడతలో ఐదు చెరువుల సుందరీకరణ

సిటీబ్యూరో: హైదరాబాద్ చెరువులను కాలుష్యరహితంగా మార్చే దిశగా దృష్టిపెట్టింది హైడ్రా. కాలుష్యనియంత్రణ బోర్డుతో ఇటీవల సమావేశమైన కమిషనర్ రంగనాథ్ చెరువుల శుద్ధీకరణపై చర్చించారు. చెరువులు కలుషకాసారంలా మారడానికి కారణాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా చెరువుల్లోకి మురుగునీరు ఎలా చేరుతుందో మార్గాలను తెలుసుకునే దిశగా ఆయా చెరువులు ఉన్న ప్రాంతాల్లో వివిధ శాఖల సమన్వయంతో సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. బెంగళూరు పర్యటన తర్వాత పైలట్ ప్రాజెక్ట్ చేయాలనుకున్నప్పటికీ బడ్జెట్ కారణంగా అది వాయిదా పడింది. దీంతో చెరువులను శుద్ధీ చేసే ప్రక్రియపై హైడ్రా దృష్టిపెట్టింది. లేక్ మ్యాన్ ఆనంద్‌మల్లిగవాడ్‌తో కలిసి బెంగళూరులో ఆయన అభివృద్ధి చేసిన 35 చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్.. ప్రస్తుతం హైదరాబాద్‌లో తొలిదశలో ఐదు చెరువుల శుద్ధీకరణకు నిర్ణయం తీసుకున్నారు. తొలిదశలో చందానగర్‌లోని ఈర్లచెరువు, అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, తార్నాకలోని ఎర్రకుంట, మాదాపూర్‌లోని తమ్మిడి చెరువు, ఖాజాగూడలోని తౌతాని కుంటలను పునరుద్ధరించాలని నిర్ణయించారు.

100 చెరువుల్లో మురుగునీరు

హైడ్రా పరిధిలో ఓఆర్ఆర్ లోపల 565 చెరువులున్నాయి. వీటిలో సుమారు వంద చెరువుల్లో మురుగునీరు ఉన్నట్లు హైడ్రా బృందం సర్వేలో తేలింది. చెరువుల్లో పూడికతీయడంతో పాటు ఆ మట్టితో గట్లు ఏర్పాటు చేసి.. సుందరీకరణ పనులు చేస్తారు. చెరువులోకి చేరే మురుగునీటిని శుద్ధీచేసే ప్రక్రియపై స్థానికులతో కలిపి ఒక పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు.

బెంగళూరు తరహాలో..

బృహత్ బెంగళూరు మహాపాలిక తరహాలో జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్‌లోపలి మున్సిపాలిటీల పరిధిలో చెరువుల్లోకి వస్తున్న పారిశ్రామిక వ్యర్థాలు, నాలాలు, అపార్ట్‌మెంట్ల ద్వారా వస్తున్న వ్యర్థాలపై దృష్టి పెట్టి ఆయా శాఖల సహకారంతో వాటిని ఆపడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించారు. ఏయే చెరువుల్లో పరిశ్రమల వ్యర్థాలు కలుస్తున్నాయో పరిశీలించి.. వాటికి నోటీసులను ఇవ్వాలని పీసీబీ బృందానికి హైడ్రా కమిషనర్ సూచించినట్లు తెలిసింది. అంతే కాకుండా అపార్ట్‌మెంట్లలో ఎస్టీపీలు ఏర్పాటుపై సంబంధిత అధికారులు పర్యవేక్షించి రిపోర్ట్ ఇవ్వాలని సూచించారు.

తొలివిడతలో..

తొలివిడతలో 5 చెరువులను శుద్ధీ చేయడానికి నిర్ణయించారు. ఈర్ల చెరువు, బతుకమ్మకుంట, ఎర్రకుంట, తౌతాని కుంట, తమ్మిడి చెరువులను ఎంపిక చేశారు. బతుకమ్మకుంట, ఎర్రకుంట, తౌతానికుంటలను ఇప్పటికే హైడ్రా కమిషనర్ రంగనాథ్ బృందం సందర్శించి...స్థానికులతో చెరువుల అభివృద్ధిపై చర్చించింది. తక్కువ ఖర్చుతో చెరువుల శుద్ధీకరణతో పాటు సుందరీకరణ చేపట్టాలనుకుంటున్నారు.